

ఇంటర్‌లో నేటినుంచి 'సంకల్ప్'

చిత్తూరు సెంట్రల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): చదువులో వెనుకబడిన విద్యార్థులను తీర్చిదిద్దేందుకు ఇంటర్మీడియట్‌లో సంకల్ప్-2025 కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు ఆర్‌ఐవో సయ్యద్ మౌలా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అక్టోబరులో నిర్వహించిన త్రైమాసిక పరీక్షల ఆధారంగా విద్యార్థులను మూడు గ్రేడ్లుగా విభజించామన్నారు. ఫిబ్రవరి 5వ తేదీవరకు కొనసాగే ఈ కార్యక్రమంలో సబ్జెక్టుల వారీగా క్వశ్చన్ బ్యాంకు రూపొందించడం జరుగుతుందని పేర్కొన్నారు. దీనిపై రోజూ మధ్యాహ్నం మూడు నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు శిక్షణ ఇవ్వనున్నట్లు వివరించారు.

కలెక్టరేట్‌లో నేడు 'పీజీఆర్ఎస్'

చిత్తూరు అర్బన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) కార్యక్రమం జరుగుతుందని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరిగే ఈ కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తారని పేర్కొన్నారు. జిల్లా పోలీసు(పాత) కార్యాలయంలోనూ సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పీజీఆర్ఎస్ కార్యక్రమం జరుగుతుందని ఎస్పీ మణికంఠ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చే ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తామని పేర్కొన్నారు.

ప్రభుత్వ కళాశాలల అధ్యాపక సంఘం అధ్యక్షుడిగా వాసు



నూతన కార్యవర్గ సభ్యులు

చిత్తూరు సెంట్రల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కళాశాలల అధ్యాపక సంఘం చిత్తూరు జిల్లా అధ్యక్షుడిగా ఇ.వాసు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గ ఎన్నికలు ఆదివారం స్థానిక ఎన్‌పీఎస్ డిగ్రీ కళాశాలలో రిటర్నింగ్ అధికారి ఈశ్వర్ బాబు అధ్యక్షతన జరిగాయి. కార్యదర్శిగా తిరుకుమరన్ (ఎన్‌పీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల), మహిళా సెక్రటరీగా వినీల (ఎన్‌పీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల), కోశాధికారిగా భానుప్రకాష్ (పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల) ఎన్నికయ్యారు. అధ్యాపకుల సమస్యలు పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామని కమిటీ సభ్యులు తెలిపారు ఎన్నికల ప్రక్రియలో తిరుపతి కార్యదర్శి వెంకటకృష్ణయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.



పుంగనూరు మండలం ఆరంట్లపల్లె వద్ద వరిపొలంలో వర్షపు నీరు - చౌడేపల్లె మండలం కోటూరులో నేల వాలిన ట్రాన్స్‌ఫార్మర్ - తుపాను దెబ్బకు కోదండరామాపురంలో నేలకొరిగిన వరి పంట

కొనసాగిన వర్షం

చిత్తూరు కలెక్టరేట్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుపాను ప్రభావంతో ఆదివారం కూడా వర్షాలు కొనసాగాయి.మూడ్రోజులుగా ఆకాశం మేఘావృతమై వుండడంతో పాటు ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురుస్తుండడంతో జనజీవనం స్తంభించిపోయింది.చలి వణికిస్తుండడంతో జనం ఇళ్లకే పరిమితమయ్యారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్‌రూమ్‌కు పలుచోట్ల నుంచి విద్యుత్, నీటి సరఫరాల్లో అంతరాయాలపై ఫిర్యాదులందాయి. సోమవారం కూడా జిల్లా అంతటా భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. ముసురు వల్ల నేలలో తేమశాతం పెరిగి పంటలకు తెగుళ్ళు ఏర్పడి, దిగుబడితో పాటు నాణ్యతపై తీవ్ర ప్రభావం చూపుతుందన్న ఆందోళన రైతులను వెంటాడుతోంది.



వర్షంతో జనసంచారం లేని చిత్తూరు గాంధీ సర్కిల్

నేడు పాఠశాలలకు, కళాశాలలకు సెలవు

వర్ష హెచ్చరికల నేపథ్యంలో జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు, కళాశాలలకు సోమవారం సెలవు ప్రకటించారు.

● నగరిలో అత్యధిక వర్షపాతం

శనివారం ఉదయం నుంచి ఆదివారం ఉదయం 8 గంటల దాకా జిల్లావ్యాప్తంగా మోస్తరు వర్షాలు కురిశాయి. అత్యధికంగా నగరిలో 132.4 మిమీ వర్షపాతం నమోదయ్యింది. కార్వేటినగరంలో 119.4, నింద్రలో 116, పాలసముద్రంలో 104.4,విజయపురంలో 93.8, గుడిపాలలో 85.2, సోమలలో 83.2, శ్రీరంగరాజపురంలో 72.2, రొంపిచెర్లలో 67.6, పులిచెర్లలో 66.6, పెనుమూరులో 65, వెదురుకుప్పంలో 62.4, సదుంలో 60.8, చౌడేపల్లిలో 51.8, బంగారుపాళ్యంలో 49.2, చిత్తూరు రూరల్‌లో 47.2, చిత్తూరులో 46, గంగాధర నెల్లూరులో 45.8, గంగవరంలో 45.8, యాదమరిలో 45, పూతలపట్టులో 42.8, పుంగనూరులో 40.2, ఐరాలలో 40, తవణంపల్లెలో 39.8, పలమనేరులో 36.4, రామకుప్పంలో 30, బైరెడ్డిపల్లిలో 28.6, పెద్దపంజాణిలో 28.2, వి.కోటలో 27.6, శాంతిపురంలో 26, కుప్పంలో 21.4, గుడుపల్లిలో 16 మిమీ వర్షపాతం నమోదయ్యింది.ఆదివారం ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు పలు మండలాల్లో వర్షం కురిసింది. అత్యధికంగా చిత్తూరులో 56.4మిమీ వర్షపాతం నమోదయ్యింది.

పలు ప్రాంతాల్లో పంటనష్టం

విజయపురం మండలంలోని వేరుశనగ, వరి పంటలు నీట మునిగాయి. మండలంలోని 42 చెరువుల్లో 37 చెరువులు నిండాయి. చౌడేపల్లె మండలంలోని కాటిపేరి, దిగువపల్లె, చారాల, శెట్టిపేట పంచాయతీల్లో 50 ఎకరాల పైనే వరి పంట నేల కొరిగింది. చారాలలో, కోటూరులో 2 ట్రాన్స్‌ఫార్మర్లు, 3 విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. పాలసముద్రం మండలంలో ఆరు చెరువులు నిండి కలుజు పారుతున్నాయి. కోదండరామాపురం, ఆముదాల,సింహరాజుపురం, పాలసముద్రం పంచాయతీల్లో వరి పంట నేలకొరిగింది. శ్రీరంగరాజపురం మండలంలోని పాపిరెడ్డిపల్లె, పాతపాళ్యం, జీఎంఆర్‌పురం వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. దీనివల్ల సుమారు 10 గ్రామాల్లో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.మార్కెట్లో టమోటా, బంగాళదుంప, బీన్స్, స్వీట్‌కార్న్, బేబీకార్న్‌కు అధిక ధరలు లభిస్తున్న తరుణంలో ఈ ముసురు కొంప ముంచుతోందని కుప్పం ప్రాంత రైతాంగం ఆవేదన వ్యక్తం చేస్తోంది. దిగుబడి తగ్గిపోవడమే కాకుండా నాణ్యత లోపించడం వల్ల తాము నష్టాలను చవిచూడాల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు.వెదురుకుప్పం మండల పరిధిలోని 178 చెరువుల్లో 30 చెరువులు పూర్తిస్థాయిలో నిండి కలుజు పారుతున్నట్లు అధికారులు తెలిపారు.వర్షం కారణంగా వెదురుకుప్పం మండలంలో పలు గ్రామాలు విద్యుత్ సరఫరా లేకుండా అంధకారంలో మగ్గాయి.సోమల మండలంలో ఇప్పుడిప్పుడే వరి కోతలు చేస్తున్న రైతులు నూర్పిడికి ఇబ్బందులు పడుతున్నారు. ధాన్యపు రాశులను వర్షానికి తడవకుండా పరదాలు, టార్పాలిన్లు కప్పి రక్షించుకునే ప్రయత్నం చేస్తున్నారు.టమోటా రైతులు ఈ వర్షానికి చీడపీడలు వ్యాపిస్తాయని ఆందోళన పడుతున్నారు. టమోటాకు ధరలు బాగున్న తరుణంలో వర్షాలతో నాణ్యత తగ్గుతుందని వాపోతున్నారు. సోమల మండలంలో పలు చోట్ల విద్యుత్ స్తంభాలు నేల కూలాయి. పత్రపల్లె, కొత్తూరు మార్గంలో వృక్షాలు నేల కూలి రాకపోకలకు అంతరాయం కలిగింది. పుంగనూరు మండలంలో 30 ఎకరాల వరిపంట నీట మునిగింది. రెండు రోజుల ముందు ఒబ్బిడి చేసిన వరి పంట తడిచి దెబ్బతింది. వరితో బాటు టమోటా, చామంతి పూల తోటలకు నష్టం వాటిల్లింది.



హనుమంత వాహనంపై కోదండరాముడి రూపంలో...

రామదూతపై అభయ ప్రదాత

తిరుచానూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి):కార్తీక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి కోదండరాముడి అలంకారంలో తిరుచానూరు పద్మావతీ దేవి హనుమంత వాహనంపై కొలువుదీరి తిరుమాడవీధుల్లో ఊరేగారు. వాహన సేవ ప్రారంభం నుంచి ముగిసే వరకు వర్షం పడుతూనే ఉంది.ఆదివారం ఉదయం చర్నాకోలు, దండం ధరించి రాజమన్నార్ అలంకరణలో కల్పవృక్ష వాహనంపై అమ్మవారు తిరువీధుల్లో భక్తులకు అభయమిచ్చారు.ఉదయం ఏడు గంటలకు అమ్మవారిని అద్దాల మండపం నుంచి వేంచేపుగా వాహన మండపానికి తీసుకొచ్చి కల్పవృక్ష వాహనంపై కొలువుదీర్చి, అలంకరించారు. గజతురగ అశ్వాలు ముందుకు సాగుతుండగా జీయర్ స్వాముల దివ్య ప్రబంధ పారాయణం, మంగళవాయిద్యం, చిన్నారుల కోలాటం, భజనలు, కళాకారుల నృత్య ప్రదర్శన, భక్తుల గోవిందనామస్మరణ నడుమ వర్షపు జల్లుల మధ్య వేడుకగా అమ్మవారికి వాహనసేవ జరిగింది. మధ్యాహ్నం శ్రీకృష్ణస్వామి ముఖమండపంలో ఉత్సవమూర్తికి స్నపన తిరుమంజనం నిర్వహించారు. అనంతరం అమ్మవారిని శ్రీరామచంద్రుడిగా అలంకరించి ఆస్థాన మండపానికి వేంచేపు చేసి ఊంజల్ సేవ నిర్వహించారు.



కల్పవృక్ష వాహనంలో రాజమన్నార్ అలంకారంలో...

జనవరిలో కొత్త రేషన్‌కార్డులు

నేటినుంచి దరఖాస్తుల స్వీకరణ

చిత్తూరు కలెక్టరేట్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం పేదలకు తీపి కబురు తెచ్చింది. వైసీపీ హయాంలో కొత్త రేషన్ కార్డులను ఇవ్వలేదు. దరఖాస్తులను ఏళ్ల తరబడి పెండింగ్‌లో పెట్టేసింది. వివాహాలు చేసుకున్న జంటలకూ కార్డులు ఇవ్వలేదు. మార్పు, చేర్పులకూ అవకాశం కల్పించలేదు. వీటిని పరిగణనలోకి తీసుకున్న కూటమి ప్రభుత్వం కొత్త రేషన్ కార్డుల జారీకి చర్యలు చేపట్టింది. సోమవారం నుంచి ఈనెల 20వ తేదీ వరకు కొత్తకార్డులకు దరఖాస్తులతోపాటు ప్రస్తుతం కార్డుల్లో మార్పులకు అవకాశం కల్పించింది. జిల్లాలోని గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకునేలా ఏర్పాట్లు చేసింది. వచ్చిన దరఖాస్తులకు ఆరంచెల తనిఖీ చేశాక.. జనవరిలో కొత్తకార్డుల జారీ చేయనున్నారు. ఈమేరకు సాఫ్ట్‌వేర్ సిద్ధం చేస్తున్నారు.

8న ఎన్ఎంఎంఎస్ పరీక్ష

చిత్తూరు సెంట్రల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): 2024-25 విద్యాసంవత్సరానికి సంబంధించి జాతీయ ఉపకార వేతనం (ఎన్ఎంఎంఎస్)పరీక్ష డిసెంబరు 8న ఉదయం 10నుంచి మధ్యాహ్నం 1గంటవరకు జరుగుతుందని డీఈవో వరలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థుల హాల్‌టిక్కెట్లను ప్రధానోపాధ్యాయులు యుడైస్‌కోడ్ ఉపయోగించి bse.ap.gov.in వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసి అందజేయాలని డీఈవో సూచించారు.

పంట పొలాల్లో వింత చేప



వరదయ్యపాళెం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కారిపాకం గ్రామానికి వెళ్లే దారి పక్కనే పొలాల్లో విచిత్ర చేప రైతుకు చిక్కింది. ముళ్లతో నిండి ప్రత్యేక ఆకృతిలో ఉన్న ఈ చేపను స్థానికులు వింతగా చూస్తున్నారు.



అవార్డుల పీహెచ్‌సీకి సిబ్బంది కొరత

స్టాఫ్ నర్సులు లేక ఏఎన్ఎంలచే విధులు

వి.కోట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి):వైద్య సదుపాయాల కల్పనలో ఉత్తమ పనితీరుతో ఒకప్పుడు అవార్డులందుకున్న వి.కోట మండలంలోని ఓగు పీహెచ్‌సీ సిబ్బంది కొరతను ఎదుర్కొంటోంది.2016లో ఏర్పాటు చేసిన ఈ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి మండల పరిధిలోని 18పంచాయతీల నుంచి నిత్యం 200మంది వస్తుంటారు.ఇక్కడున్న నలుగురు వైద్యుల్లో ఇద్దరు రెగ్యులర్‌గా ఉండగా, 104 విధులకు ఒకరు, ఎఫ్‌డీపీ విధులకు మరొకరు వెళ్లాల్సి ఉంది. అయితే నగరి సత్రవాడ పీహెచ్‌సీకి ఇక్కడి వైద్యురాలిని డిప్యుటేషన్‌పై పంపడంతో ముగ్గురే విధులు నిర్వహిస్తున్నారు.ఏడాది కాలంగా ముగ్గురు స్టాఫ్ నర్సులకు గాను ఒక్కరే విధులు నిర్వహిస్తున్నారు. గతంలో ముగ్గురు నర్సులుండగా వారిలో ఒకరు పుంగనూరుకు బదిలీ కాగా, మరొకరు ఎయిమ్స్‌లో పోస్టు రావడంతో ఉద్యోగం వదిలేశారు.రోగుల తాకిడి ఎక్కువగా ఉన్నప్పుడు ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు నర్సుల విధులు నిర్వహించాల్సి వస్తోంది. 25 సచివాలయాలకు గాను కేవలం 10 మంది మాత్రమే ఏఎన్ఎంలు విధులు నిర్వహిస్తున్నారు.మిగిలిన 15 పోస్టులు దీర్ఘకాలంగా ఖాళీగానే వున్నాయి.వీటికి తోడు మరికొన్ని పోస్టులు కూడా ఖాళీగానే ఉంటున్నాయి. జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు సొంత మండలం కావడాన ఇక్కడి ఇబ్బందులపై పలుమార్లు విన్నవించినా పోస్టులు భర్తీకాలేదు. వైద్య, ఆరోగ్య శాఖ ఇప్పటికైనా స్పందించి ఓగు పీహెచ్‌సీలో పోస్టులు భర్తీ చేసి రోగులకు మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



స్మార్ట్‌డోర్ లాక్

మీ ఇంటి భద్రత మీ చేతుల్లోనే

జిల్లావ్యాప్తంగా 6,500 స్మార్ట్‌డోర్ లాక్‌ల పంపిణీ

చిత్తూరు అర్బన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఇళ్లల్లో జరిగే దొంగతనాలను అరికట్టేందుకు పోలీసులు సాంకేతిక పరిజ్ఞానంతో ముందడుగు వేస్తున్నారు. స్మార్ట్ అలారంప్యాడ్ లాక్‌లను ఉపయోగించి దొంగలకు చెక్ పెడుతున్నారు. రెండ్రోజులుగా జిల్లావ్యాప్తంగా 6,500 స్మార్ట్‌డోర్ లాక్‌లను ప్రజలకు అందించారు. ప్రముఖ నగరాల్లో అభివృద్ధి చెందిన స్మార్ట్‌సిటీల మాదిరిగా స్మార్ట్ భద్రతా వ్యవస్థతో అనుసంధానం చేసి.. దొంగతనాలు లేని జిల్లాగా మార్చడానికి చర్యలు చేపట్టారు. దొంగతనాలను అరికట్టడానికి ఇదివరకు సీసీ కెమెరాలు, ఇంట్రూడర్ అలారం వంటి పరికరాలను ఉపయోగించిన పోలీసులు.. తాజాగా స్మార్ట్‌అలారం ప్యాడ్‌లాక్‌లను అందుబాటులోకి తెచ్చారు. వీటిపై జిల్లాప్రజలతోపాటు ఆలయాలు, చర్చిల నిర్వాహకులకు అవగాహన కల్పించడానికి ప్రత్యేక శిబిరాలను నిర్వహిస్తున్నారు. లాక్స్ ఏర్పాటు, ఉపయోగం, నిర్వహణపై ఎస్‌హెచ్‌వోలు అవగాహన కల్పిస్తున్నారు.

స్మార్ట్‌లాక్స్ పనిచేసే విధానం

● ప్యాడ్‌లాక్ అనేది గాలి, నీటి ప్రభావానికి గురికాకుండా వెదర్‌ప్రూఫ్ సాంకేతికతతో తయారు చేశారు. ● ఈ ప్యాడ్‌లాక్‌లకు పికొరెసిస్టెంట్ కీహోల్ ఉండటం వల్ల దొంగల ప్రవేశాన్ని అడ్డుకుంటుంది. ● ఇంటికి లాక్ వేశాక చిన్న బీప్ సౌండ్ వినిపించినప్పుడు అలారం యాక్టివేట్ అయినట్లు అర్థం. ● అలారం యాక్టివేట్ అయ్యాక ప్యాడ్‌లాక్‌ను కదిలిస్తే పెద్ద శబ్దంతో అలారం మోగుతుంది. ● ఇందులో లాంగ్‌లైఫ్ బ్యాటరీలు ముందుగానే అమర్చి ఉంటాయి. ఒక్కసారి లాక్ అయ్యాక కీలేకుండా ఎవ్వరూ దీన్ని తీయలేరు.



స్మార్ట్‌డోర్ లాక్‌లను పంపిణీ చేస్తున్న సీఐ నెట్టికంఠయ్య, ఎస్ఐ ప్రసాద్

స్మార్ట్‌లాక్‌లను రూ.450కే అందిస్తున్నాం

స్మార్ట్‌లాక్‌లను రూ.450కే అందిస్తున్నాం. జిల్లావ్యాప్తంగా ఇప్పటికే 6,500 స్మార్ట్‌లాక్‌లను ప్రజలకు అందించాం. ఇది సాధారణ తాళం కంటే భిన్నంగా ఉంటుంది. ఎవరైనా అనుమతి లేకుండా తలుపు తెరవడానికి ప్రయత్నిస్తే అలారం మోగి హెచ్చరికలు జారీ చేస్తుంది. ప్రజలంతా స్మార్ట్‌డోర్‌లాక్స్ ఉపయోగించి జిల్లా పోలీసులతో కలిసి సురక్షిత సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలి. - ఎస్పీ మణికంఠ



ఉధృతంగా తలకోన జలపాతం

ఎర్రావారిపాలెం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): శేషాచలంలో కురుస్తున్న భారీ వర్షాలతో తలకోన జలపాతం ఉధృతంగా ప్రవహిస్తోంది. అడవుల్లోని వాగులు, వంకల నుంచి నీరు భారీగా వస్తుండడంతో జలపాతం సముద్ర మట్టానికి 750 అడుగుల నుంచి జాలువారుతోంది. ముందు జాగ్రత్త చర్యగా పర్యాటకులను వారం రోజుల పాటు రాకుండా నిషేధించినట్లు చామల ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ వెంకట్రమణ తెలిపారు.

చెన్నై కేంద్రంగా వున్న దక్షిణ రైల్వే జోన్ లో ఉన్న ఏపీలోని ఏడు రైల్వే స్టేషన్లు అభివృద్ధికి ఆమడదూరంలోనే వుండిపోయాయి. ఆధునికీకరణ, లైన్ల విస్తరణ, అర్బన్ రైళ్ల నిర్వహణ, కొత్త రైళ్ల నిలుపుదల తదితర విషయాల్లో అధికారుల వివక్ష కారణంగా ఈ స్టేషన్లు వెనకబడి పోయాయి. గుంతకల్ కేంద్రంగా ఉన్న దక్షిణమధ్య రైల్వే డివిజన్‌లో కలిపితే తప్ప ఈ స్టేషన్లు అభివృద్ధికి నోచుకునే పరిస్థితి లేదు.

అభివృద్ధికి ఆమడ దూరంలో
ఆ ఏడు స్టేషన్లు!



వందే భారత్‌ను పుత్తూరులో ఆపాలి

రాష్ట్రంలో చివరి స్టేషన్ అయిన పుత్తూరు నుంచి రాజధాని అమరావతిలో, హైకోర్టులో పనుల కోసం ప్రజలు వెళుతుంటారు. ఇక రాజకీయనాయకుల అనుచరులు పైరవీల కోసం నిత్యం పరుగులు పెడుతుంటారు. వీరందరి కోసం మూడే గంటల వ్యవధిలో రాజధానికి చేరుకునే వందేభారత్ రైలు రోజూ ఉదయం ఆరుగంటలకు పుత్తూరు మీదుగా వెళుతుంది.ఈ రైలును పుత్తూరు స్టేషన్‌లో ఆపితే పది గంటల కల్లా అమరావతిలో పనులు చేసుకుని అదే రోజు తిరిగి ఇంటికి చేరుకోవచ్చు. ప్రస్తుతం ఈ రైలు తిరువళ్లూరులో మాత్రమే ఆగి తర్వాత రేణిగుంటలో ఆగుతుంది. అలాగే తిరుపతి మీదుగా నడిచే చెన్నై - నెల్లూరు ఫాస్ట్ ప్యాసింజరును కొంత కాలంగా ఆపేశారు. దీని పునరుద్ధరణతో పాటు తిరుత్తణి వరకు వచ్చి ఆగే చెన్నై లోకల్ రైళ్లను రేణిగుంట వరకు పొడిగించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

రోజూ రూ.రెండు లక్షల ఆదాయం

పూడి, తడుకు, ఎస్‌వి పురం, పుత్తూరు, వేపగుంట, ఏకాంబరకుప్పం, నగరి స్టేషన్లు దక్షిణ రైల్వే జోన్‌లో వున్నాయి. తమిళనాడుకు చెందిన చివరి స్టేషన్ అయిన తిరుత్తణికి 15 అర్బన్ రైళ్లు నడుస్తుండగా ఈ స్టేషన్ల మీదుగా రేణిగుంటకు లేక తిరుపతికి అయిదు రైళ్లు మాత్రమే నడుస్తున్నాయి. వ్యాపారాలు, బంధుత్వాల పరంగా రోజూ ఈ స్టేషన్ల నుంచి దాదాపు పదివేల మంది ప్రయాణిస్తుంటారు. ఫలితంగా ప్రధానమైన పుత్తూరు, ఏకాంబకుప్పం స్టేషన్ల నుంచే రోజూ దాదాపు రెండు లక్షల రూపాయల ఆదాయం వస్తోంది.

మనకేదీ ఆటో సిగ్నల్ వ్యవస్థ ?

అటు తమిళనాడుకు చెందిన పొన్‌పాడి స్టేషన్ వరకు ఇటు పూడి వరకు ఆటో సిగ్నల్ వ్యవస్థను అమర్చారు. మధ్యలో వున్న ఈ ఏడు స్టేషన్ల మధ్య మాత్రం ఆటో సిగ్నల్ వ్యవస్థ ఏర్పాటు కాలేదు. ఈ ఆటో సిగ్నల్ వల్ల మరో స్టేషన్‌కు రైలు చేరకున్నా ఒకే లైనులో మూడు రైళ్లు కూడా ఒకదాని వెంట మరొకటి నడుస్తుంటాయి. ఫలితంగా స్టేషన్లలో రైళ్లు ఆగే పని లేకుండా పరుగులు తీస్తుంటాయి. అదే పాత వ్యవస్థలో అయితే స్టేషన్‌ను వదిలిన రైలు పక్క స్టేషన్‌కు చేరాకే మరో రైలును పంపాల్సి వచ్చేది. ఈ ఆటో సిగ్నల్ వ్యవస్థ గురించి అటు సదరన్ రైల్వే ఇటు సౌత్ సెంట్రల్ రైల్వే అధికారులు పట్టించుకోవడం లేదు. ఇటీవల ప్రయాణికుల రైళ్లు, గూడ్సు రైళ్ల సంఖ్య పెరగడంతో పాటు వేగం కూడా పెరిగింది కానీ అందుకు అనుగుణంగా లైన్ల విస్తరణ జరగలేదు. బ్రిటిష్ కాలం నాటి రెండు లైన్లు మాత్రమే ఈ ప్రాంతంలో ఇప్పటికీ వుండడం విశేషం. అయితే తమిళనాడులోని తిరుత్తణి వరకు నాలుగు, ఆరు లైన్ల విస్తరణతో రైళ్లు పరుగులు పెడుతుంటాయి. **- పుత్తూరు, ఆంధ్రజ్యోతి**

దక్షిణ మధ్య రైల్వే జోన్‌లో కలపాలి

అభివృద్ధి పనులు వేగంగా జరిగేందుకు గుంతకల్ కేంద్రంగా ఉన్న దక్షిణమధ్య రైల్వే డివిజన్‌లో ఈ ఏడు స్టేషన్లను కలపాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు. భాష సమస్యతో రాజకీయ నాయకులు కూడా పలు మార్లు చెన్నై వెళ్లి అక్కడి అధికారులను ఒప్పించలేక రైల్వే సమస్యలను పరిష్కరించలేక పోతున్నారు. తిరుపతి ఎంపీ, జిల్లా ఎమ్మెల్యేలు కలిసి గట్టిగా ప్రయత్నిస్తే ఇది అసాధ్యం ఏమీ కాదు.

డీఎస్పీ కార్యాలయానికి ఎంపీ మిథున్‌రెడ్డి


సంతకాలు చేసేందుకు వెళ్తున్న ఎంపీ మిథున్‌రెడ్డి

పలమనేరు, డిసెంబరు1 (ఆంధ్రజ్యోతి): పలమనేరు డీఎస్పీ కార్యాలయంలో సంతకాలు చేసేందుకు రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి ఆదివారం వచ్చారు. ఆయనతో పాటు మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ, పలువురు వైసీపీ నాయకులు వచ్చారు. పుంగనూరు అల్లర్ల కేసుకు సంబంధించి మిథున్‌రెడ్డి సంతకాలు చేశారు.

కబడ్డీ జిల్లా జట్ల ఎంపిక పోటీలు రేపటికి వాయిదా

చిత్తూరు క్రీడలు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సదుంలోని పోలీస్ గ్రౌండ్‌లో సోమవారం జరగాల్సిన ఉమ్మడి జిల్లా సీనియర్ కబడ్డీ జట్ల ఎంపిక పోటీలు తుఫాను కారణంగా మంగళవారానికి వాయిదా వేశారు. ఈ మేరకు జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి మమత తెలిపారు.

జనవరి నుంచి లైఫ్ సర్టిఫికెట్ల స్వీకరణ

చిత్తూరు కలెక్టరేట్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ పెన్షనర్లు జీవించి ఉన్నట్లు ధ్రువీకరించే లైఫ్ సర్టిఫికెట్ల (జీవన్ ప్రమాణ్ పత్ర్)ను సమీప సబ్‌ట్రెజరీ కార్యాలయాల్లో జనవరి ఒకటో తేదీనుంచి ఫిబ్రవరి నెలాఖరు వరకు అందజేయాలని ఖజానాశాఖ డీడీ రామచంద్ర తెలిపారు. ఈనెలలో స్వీకరించబోమన్నారు. జిల్లాలో 12,313 మంది ప్రభుత్వ పెన్షనర్లు ఉన్నారు. 2024 మార్చి వరకు జీవన్ ప్రమాణ్ పత్ర్ ఇవ్వని 49 మంది పెన్షనర్లకు పింఛను మంజూర్లు నిలిపివేసినట్లు పేర్కొన్నారు. వివిధ కారణాలతో ఇప్పటివరకు ఇవ్వలేకపోయినవారు ఆధారాలతో సమర్పిస్తే, పరిశీలించి పెన్షన్ బకాయిలు చెల్లించే ఏర్పాట్లు చేస్తామన్నారు.

విద్యుత్ శాఖకు రూ.15 లక్షల నష్టం



బంగారుపాళ్యంలో కూలిన ట్రాన్స్‌ఫార్మర్, గుడిపాలలో మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

చిత్తూరు రూరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ కారణంగా జిల్లాలో కరెంటు స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు నేలకూలాయి. దీనివల్ల విద్యుత్ శాఖకు రూ.15లక్షల నష్టం వాటిల్లినట్లు ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్ తెలిపారు. చెట్లు తీగలపైపడటంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడిందని, సకాలంలో పునరుద్ధరించినట్లు వివరించారు. జిల్లాలో 40 స్తంభాలు, 13 ట్రాన్స్‌ఫార్మర్లు, 1.2 కిలోమీటర్ల కండక్టర్లు పాడయ్యాయన్నారు. ఐదు ట్రాన్స్‌ఫార్మర్లు నేలకూలాయన్నారు. ఎక్కువగా నగరి, కార్వేటినగరం, బంగారుపాళ్యం, పాలసముద్రం, గుడిపాల, రెడ్డిగుంట ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడిందని వివరించారు. జిల్లాలోని మూడు డివిజన్లలో కంట్రోల్ రూం ఏర్పాటు చేశామని తెలిపారు.

భవిష్యత్తు కమ్యూనిస్టులదే : సీపీఎం



సభలో ప్రసంగిస్తున్న శ్రీనివాసరావు

సత్యవేడు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రపంచాన్ని కుదిపేస్తున్న సోలార్ కుంభకోణంపై దేశ ప్రధాని నరేంద్ర మోదీ పెదవి విప్పాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. సత్యవేడులో ఆదివారం జరిగిన సీపీఎం తిరుపతి జిల్లా 14వ మహాసభలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.డబ్బు, కులం, కుటుంబ పాలన అంశాలు ఈ రోజుల్లో అధికారాన్ని, నాయకులను తయారు చేస్తున్నాయన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా, కులమతాలకతీతంగా నాయకత్వాన్ని ఎంపిక చేస్తున్న పార్టీ సీపీఎం మాత్రమేనన్నారు. ప్రజలు ప్రత్యామ్నాయ రాజకీయాలు కోరుకుంటున్నారన్న ఆయన భవిష్యత్తు కమ్యూనిస్టులదేనన్న ఆశాభావం వ్యక్తం చేశారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఓ కీలక వ్యక్తికి పారిశ్రామికవేత్త అదానీ నుంచి రూ.1750 కోట్లు ముట్టాయని మీడియా కోడై కూస్తున్నా ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు ఎందుకు విచారణ జరపడంలేదని ప్రశ్నించారు. తాను మోదీ చెప్పినట్లు చేశానని జగన్, మోదీకి చెప్పకుండా తానేమీ చేయడం లేదని చంద్రబాబు ఒకరిపై ఒకరు చెప్పుకుంటూ అదానీకి కొమ్ముకాస్తున్నారని విమర్శించారు. మోదీ పాలనలో ఉద్యోగులు, కార్మికుల వేతనాలు ఎనిమిది నుంచిమూడు శాతానికి పడిపోగా, నిత్యావసర ధరలు మాత్రం ఎనిమిది నుంచి పదహారు శాతానికి పెరిగాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి వచ్చాక ఇప్పటికి రెండు సార్లు విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై రూ.16వేల కోట్ల భారం మోపిందన్నారు. డిసెంబరు 1 నుంచి ట్రూ అప్‌చార్జీల వడ్డనకు పూనుకుంటున్న నేపథ్యంలో వెంటనే ఆ ప్రయత్నాన్ని విరమించుకోవాలని హెచ్చరించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ... వెనుకబడిన రాయలసీమ జిల్లాల అభివృద్ధికి కేంద్రం బడ్జెట్‌లో ఒక్కపైసా కూడా కేటాయించలేదని మండిపడ్డారు. మహాసభల వేదికగా తిరుపతి జిల్లా అభివృద్ధి, పార్టీ బలోపేతం, ప్రజా సమస్యల భవిష్యత్ పోరాటాల తీర్మానాన్ని ప్రవేశ పెట్టారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మూలం రమేష్, రాష్ట్ర కమిటీ సభ్యులు భాస్కరయ్య, చిత్తూరు జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు, కందారపు మురళి,జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు దాసరి జనార్దన్ , అంగేరి పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

హిజ్రాల్లో ఆధిపత్య పోరు

- పాతకక్షల నేపథ్యంలోనే హాసిని హత్య
- 12మంది నిందితుల అరెస్టు
- పరారీలో ప్రధాన నిందితుడు, మరో ఇద్దరు
- తెరవెనుక సూత్రధారి అలేఖ్య


హాసిని (ఫైల్ ఫొటో)

నెల్లూరు(క్రైం), డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): హాసిని... ఈమె ఓ ట్రాన్స్‌జెండర్... అనతికాలంలోనే రాష్ట్రంతోపాటు ఇతర రాష్ట్రాల్లోని ట్రాన్స్‌జెండర్లకు నాయకురాలిగా ఎదిగింది.. ఆమె ఉంటే తాము ఎదగలేమని మరికొందరు ట్రాన్స్‌జెం డర్లు భావించారు.. హాసినీని ఎలాగైనా అంతమొందించాలని పగబట్టారు.. ఆమెతో వైరమున్న మరికొందరితో చేతులు కలిపారు. అందరూ కలిసి కిరాయి హంతకులతో రూ.20 లక్షలకు డీల్ కుదుర్చుకున్నారు. కొంత నగదు అడ్వాన్స్‌గా ఇచ్చారు. ఆ హంతక ముఠా పక్కా స్కెచ్‌తో హాసినీని కత్తులతో విచక్షణగా రహితంగా పొడిచి హత్య చేసింది. ఇటీవల జరిగిన ఈ కేసును పోలీసులు ఛేదించారు. సుపారీ ఇచ్చిన ట్రాన్స్‌జెండర్ నాయకురాలు అలేఖ్య, మరో హిజ్రాతో పాటు 10 మంది నిందితులను అరెస్టు చేశారు. కాగా, ఈ కేసులో 15మందిని నిందితులుగా పోలీసులు గుర్తించారు. ప్రధాన నిందితుడు పరారీలో ఉన్నాడు. అతను చిక్కితే ఈ కేసులో అసలు విషయాలు వెలుగులోకి రానున్నాయి.

● కుగ్రామం నుంచి అంతర్రాష్ట్ర స్థాయికి..

నెల్లూరు జిల్లా తోటపల్లిగూడూరు మండలం చిన్నచెరుకూరుకు చెందిన మానికల హాసిని గ్రామస్థాయి నుంచి తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లోనూ హిజ్రాలకు నాయకురాలిగా ఎదిగింది. అది చూసి ఓర్వలేక ఆమె బతికి ఉంటే తమ మనుగడ ప్రశ్నార్థకమని మాజీ నాయకురాళ్లు భావించారు. పక్కా స్కెచ్ వేసి అంతమొందించారు.

● రూ.20 లక్షల సుపారీ

నెల్లూరు నగరానికి చెందిన పాత నేరస్థుడు భూపతి, నెల్లూరు రూరల్ మండలానికి చెందిన ఓ రౌడీషీటర్ ద్వారా దొరతోపు కాలనీకి చెందిన వంశీకృష్ణ, అల్లీపురానికి చెందిన కార్తీక్, నాలుగో మైలుకు చెందిన సుబ్రహ్మణ్యం, మస్తాన్ వలీ, వెంకటాద్రి, ఇందుకూరుపేట మండలం జేజేపేటకు చెందిన వంశీ, నాలుగోమైలుకి చెందిన ఓ బాలుడిని, మార్టూరు మండలం ఇసుకదర్శికి చెందిన ఎం రామును ట్రాన్స్‌జెండర్లు సంప్రదించారు. హాసినిని అడ్డుతొలగిస్తే రూ.20 లక్షలు ఇస్తామని ఒప్పందం చేసుకొని, కొంత నగదు ముందుగానే ఇచ్చారు. దీంతో నిందితులు నెల నుంచి హాసిని కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచారు. ఆమె పక్కనే ఉండే ఓ హిజ్రాను మచ్చిక చేసుకుని హాసిని కదలికలు తెలుసుకుంటూ వచ్చారు. ఈ నెల 26వ తేదీ హాసిని స్వగ్రామంలోని ఆలయం వద్దకు వెళ్లి వస్తుండగా టపాతోపు రైల్వే అండర్ బ్రిడ్జీ వద్ద కాపు కాచి పాశవికంగా హత్యచేసి పరారయ్యారు.

● అతను దొరికితే..

ఈ కేసులో సుపారీ తీసుకున్న పాత నేరస్థుడు మాత్రం దొరకలేదు. ఆ వ్యక్తి ఈ ఏడాది వినాయక చవితి ఉత్స వాలకు హిజ్రా నాయకురాలు అలేఖ్య సాయంతో కొందరు హిజ్రాలను తెలంగాణ నుంచి పిలిపించి ఇక్కడ కార్యక్రమా లను ఏర్పాటు చేయించారు. మన రాష్ట్రంలో హిజ్రాలు లేరా.. పక్క రాష్ట్రం నుంచి తెప్పించాల్నా- అంటూ హాసిని అప్పుడు వాళ్లతో గొడవపడి అతడిపై దాడి చేయించిందని, దీంతో అతను పగ పెంచుకొని హత్యకు సుపారీ తీసుకున్నట్లు తెలిసింది. ఇదిలా ఉండగా ఈ కేసులో పలు చిక్కుముడులు వీడాల్సి ఉంది. అసలు హాసిని ప్రయాణం చేసిన కారు డ్రైవర్ ఏమయ్యాడు. ఈ కేసులో ఎంతమంది పాత్ర ఉందనే ప్రశ్నలకు సమాధానం దొరకాల్సి ఉంది. సుపారీ తీసుకున్న పాత నేరస్థుడు దొరికితే అన్నీ బయటకు వస్తాయి.

తిరుమల ఘాట్‌లో యువకుల హల్‌చల్

● కారు సన్‌రూఫ్, విండోస్ నుంచి బయటకు వచ్చి కేకలు ● అదుపులోకి తీసుకున్న పోలీసులు


ఘాట్‌రోడ్డులో రన్నింగ్ కారు పైన యువకులు

తిరుమల, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): తిరుమల ఘాట్‌రోడ్డులో కొంతమంది యువకులు హల్‌చల్ చేసి పోలీసులకు చిక్కారు. హైదరాబాద్‌కు చెందిన ఆ యువకులు రన్నింగ్‌లో ఉన్న కారు సన్‌రూఫ్, విండోస్ నుంచి బయటకు వేలాడుతూ కేకలు వేస్తూ సెల్ఫీలు, వీడియోలు తీసుకున్నారు. తిరుపతి నుంచి తిరుమలకు చేరుకునే రెండవ ఘాట్‌రోడ్డులో ఆదివారం ఉదయం చోటుచేసుకున్న ఈ ఘటన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. టీటీడీ విజిలెన్స్ స్పందించి సీసీ కెమెరాల ఫుటేజ్ ద్వారా ఆ యువకులను తిరుమలలోని నందకం విశ్రాంతి గృహం వద్ద ఆదివారం రాత్రి అదుపులోకి తీసుకున్నారు. అనంతరం టూటౌన్ పోలీసులకు అప్పగించారు. కారులో ఇద్దరు మహిళలు, చిన్నారులు కూడా ఉన్నట్టు తెలిసింది. ఘాట్‌రోడ్డులో కారును వేగంగా నడుపుతూ, ప్రమాదకరంగా వేలాడుతూ సెల్ఫీలు తీసుకోవడంతో పాటు వెనుకవస్తున్న వాహనదారులను ఇబ్బందులకు గురిచేసిన ఆరుగురు యువకులను తిరుమల పోలీసులు అదుపులోకి తీసుకున్నారని టీటీడీ ఓ ప్రకటన ద్వారా తెలిపింది. ప్రమాదకర విన్యాసాలు చేయకూడదని, ధార్మిక క్షేత్రంలో విచ్చలవిడిగా ప్రవర్తించడం పద్ధతికాదని కౌన్సిలింగ్ ఇచ్చినట్టు తెలిపింది. నిబంధనలను అతిక్రమించడంతో వారిపై చర్యలు తీసుకోనున్నట్టు టీటీడీ తెలిపింది.

ఏనుగుల దాడిలో పంటల ధ్వంసం


ఏనుగుల దాడిలో ధ్వంసమైన కొబ్బరిచెట్లు

రామకుప్పం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): పంద్యాలమడుగు సమీపంలో శనివారం రాత్రి ఐదు ఏనుగులు హల్‌చల్ చేశాయి. తోటలను ధ్వంసం చేశాయి. దాడుల్లో లోకేశ్‌కు చెందిన తోటలో 10కొబ్బరిచెట్లను, స్వీట్‌కార్న్ తోటను, హేమచంద్రారెడ్డికు చెందిన దోసతోటను ధ్వంసం చేశాయి. స్థానికుల సమాచారంతో ఆదివారం ఉదయం అటవీ అధికారులు, సిబ్బంది చేరుకున్నారు. సమీప అడవిలోని ఏనుగుల మందను గుర్తించి వాటిని తమిళనాడు అడవిలోకి తరిమేశారు. వర్షా లు కురుస్తున్న తరుణంలో ఏనుగులు తిరిగి వచ్చే అవకాశాలున్నందున అప్రమత్తం ఉండాలని అటవీ అధికారులు సూచించారు.

● **పలమనేరు:** ముసలిమడుగులో బాలాజినాయుడుకు చెందిన వరిపంటపై ఆదివారం రాత్రి మూడు ఏనుగుల గుంపు దాడి చేశాయి. పంటను నష్టపరిచాయి. పంట చేతికి వస్తున్న సమయంలో వరిపంటను ఎందుకూ పనికిరాకుండా తొక్కేశాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి నష్టపరిహారం చెల్లించాలని విజ్ఞప్తిచేశారు.

పులిచెర్ల వైపు గజరాజులు

కల్లూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మూడు నెలలుగా పులిచెర్ల మండలంలో తిష్టవేసిన ఏనుగుల గుంపు పంటలకు అపారనష్టం కలిగిస్తూ గత నెల 22న రాత్రి చిన్నగొట్టిగల్లు మండలంలోకి ప్రవేశించాయి. దేవపట్లవారిపల్లి సమీపంలో వేటగాళ్లు అమర్చిన విద్యుత్ తీగల ఉచ్చులో ఏనుగు మృతి చెందిన విషయం తెలి సిందే. అక్కడే మూడు రోజుల పాటు సంచరించిన గుంపు మదనపల్లి - తిరుపతి హైవే ను దాటుకొని భాక రాపేట సమీపం దేవర కొండ అడవిలోకి చేరు కుంది. శనివారం రాత్రి హైవేను దాటుకొని చిన్న గొట్టిగల్లు మండలం గాండ్లపల్లి, శాంతి నగర్, దిగువూరు చేరుకుని పంటలను ధ్వంసం చేశాయి. ఇవి భీమవరం అటవీ ప్రాంతం లోకి చేరుకుంటున్నాయని తెలుసు కున్న రేంజర్ థామస్ సుకుమార్, సెక్షన్ ఆఫీసర్ మహమ్మద్ షఫి, బీట్ అధికారి మున్నా ఆదివారం పులిచెర్ల మండలం ప్రజలను అప్రమత్తం చేశారు.


వరి నష్టాన్ని చూపుతున్న రైతు బాలాజి నాయుడు

పట్టుబడ్డ దొంగకు దేహశుద్ధి

గంగవరం, డిసెంబరు01(ఆంధ్రజ్యోతి): దొంగకు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించిన ఘైనమిది. మబ్బువాళ్లపేటకు చెందిన రాము చోరీలకు అలవాటుపడ్డాడు. నల్లగుట్లపల్లె సమీపంలోని ఓ హోటల్‌లో ఇతడు ఆదివారం ఇడ్లీ స్ట్రీమ్ బాక్స్ దొంగిలించాడు. నెత్తిన పెట్టుకుని తీసుకువెళ్తుండగా బరువు ఎక్కువగా ఉండడంతో మార్గమధ్యలో కిందికి దించాడు. తర్వాత దారిన పోతున్న వారిని పిలిచి బాక్సు నెత్తిన పెట్టడానికి సాయమడిగాడు. వారు స్ట్రీమ్ బాక్సు తమ బంధువుకు చెందినదిగా గుర్తించారు. గట్టిగా నిలదీసేసరికి రాము పారిపోయేందుకు ప్రయత్నించగా వారు పట్టుకున్నారు. దీంతో స్థానికులు కూడా అక్కడకు చేరి ఇతడికి దేహశుద్ధి చేశారు. తర్వాత పోలీసులకు అప్పగించారు. ఈ హోటల్ మిద్దెపై పీవీసీ పైపులు కూడా గత వారం చోరీకు గురయ్యాయి. సీసీ కెమెరా ఫుటేజిలు పరిశీలించగా రాము అని తేలింది. అయినా కనికరించి యజమాని ఫిర్యాదు చేయకుండా వదిలేశానని, కానీ మళ్లీ ఆదివారం చోరీకి తెగించాడని హోటల్ యజమాని చెప్పారు.

బైక్‌ని ఢీకొన్న కారు: ఒకరి మృతి


గజేంద్ర (ఫైల్ ఫొటో)

గంగాధరనెల్లూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కారు అదుపుతప్పి ఎదురుగా వస్తున్న బైక్‌ని ఢీకొంది. ఈ ప్రమాదంలో బైక్‌పై ఉన్న వ్యక్తి తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. గంగాధరనెల్లూరు పంచాయతీ మోతరంగనపల్లె గ్రామానికి చెందిన గోవిందమండడి కుమారుడు గజేంద్ర అలియాస్ గజేంద్రయాదవ్ (34) జైన్ ఇరిగేషన్ డ్రిప్ కంపెనీకి సంబంధించి చిత్తూరు షాపులో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. తిరుపతి జిల్లా రామచంద్రాపురం మండలం రాయలచెరువులోని అత్తగారింటికి శనివారం వెళ్లారు. ఆదివారం ఉదయం అక్కడినుంచి బైక్‌పై స్వగ్రామం బయల్దేరాడు. నెల్లేపల్లె వద్దకొచ్చేసరికి చిత్తూరు నుంచి పుత్తూరు వైపు వెళుతున్న కారు అదుపుతప్పి బైక్‌పై వస్తున్న గజేంద్రను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలవడంతో 108లో చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతిచెందాడు. గజేంద్ర భార్య తనూజ ఫిర్యాదు మేరకు గంగాధరనెల్లూరు పోలీసులు కేసు నమోదు చేశారు.

కుప్పం సీవోఈకి స్కాచ్ అవార్డ్



అవార్డు అందుకుంటున్న ఉద్యాన శాఖ జేడీ దేవమునిరెడ్డి

కుప్పం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కుప్పంలోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ ఫ్లవర్స్ అండ్ వెజిటబుల్స్ (సీవోఈ)కి ప్రతిష్ఠాత్మక 'స్కాచ్ అవార్డ్ లభించింది. ఢిల్లీకి చెందిన స్కాచ్ సంస్థ యేటా సామాజికంగా ఉన్నతమైన సేవలు అందిస్తున్న ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలను ఎంపిక చేసి అవార్డులు ప్రకటిస్తుంది. ఈ ఏడాది ఆంధ్రప్రదేశ్ ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో రైతులకు సీవోయి చేస్తున్న సేవలను గుర్తించి స్కాచ్ సిల్వర్ అవార్డు ప్రకటించింది. ఢిల్లీలో గతనెల 29న జరిగిన కార్యక్రమంలో ఉద్యానశాఖ జిల్లా జాయింట్ డైరెక్టర్ దేవమునిరెడ్డి ఈ అవార్డును సంస్థ ప్రతినిధుల నుంచి అందుకున్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన


పలమనేరులో పరీక్షలు చేస్తున్న వైద్యులు

సోమల, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): డీకే ఆదికేశవులు నాయుడు కుటుంబం ఆధ్వర్యంలో మారుమూల గ్రామాల్లో వైద్యసేవలు అందజేయడం అభినందనీయమని టీడీపీ నాయకులు మాజీ ఐడీసీ డైరెక్టర్ సాంబయ్య, కామిశెట్టి నగేశ్ పేర్కొన్నారు. ఆదివారం సోమల హైస్కూల్‌లో బెంగుళూరు వైదేహి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి వైద్య బృందం పరీక్షలు నిర్వహించారు. 150 మంది వివిధ రకాల వ్యాధులకు పరీక్షలు చేయించుకున్నారు. ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ సతీశ్, వైద్యులు డాక్టర్ దివ్య, సురేశ్, పరమేశ్వర్, కపిల్ సుబ్రమణ్యం, మునివెంకటప్ప పాల్గొన్నారు. ●పలమనేరు : స్థానిక పీజేసీ కళ్యాణ మండపంలో బలిజ అభ్యుదయ సేవాసంఘం ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. బెంగళూరులోని వైదేహి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి చెందిన వైద్యబృందం పరీక్షలు నిర్వహించారు.

ఉరుస్తున్న సబ్‌స్టేషన్ కంట్రోల్ రూం



కల్లూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): తాజా వర్షాలకు కల్లూరు విద్యుత్ సబ్‌స్టేషన్‌లోని కంట్రోల్ రూం, బిల్లింగ్ రూం, స్టాక్ రూంలు తడిసి ముద్దయ్యాయి. సబ్‌స్టేషన్ కంట్రోల్ బోర్డు ఈ రూములో ఉండటంతో షిప్ట్ ఆపరేటర్లు ఇక్కడే పనిచేస్తుంటారు. ప్రస్తుతం వర్షపు నీరు కార్యాలయంలో కారుతుండటంతో సిబ్బంది పాత్రలు, క్యాన్‌లు అడ్డు పెట్టారు. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ అయితే సిబ్బంది ప్రమాదం జరుగుతుందని సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. ఈ భవనానికి మరమ్మత్తులు చేపడుతామని, సమీపంలో నిర్మించిన కొత్త భవనంలోకి కంట్రోల్ రూముమారుస్తామని ఏపీఎస్‌పీడీసీఎల్ ఏఈ పురుషోత్తం తెలిపారు.

మంత్రి సవితను కలిసిన టీడీపీ నేతలు



రామకుప్పం, డిసెంబరు (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితను మండల నేతలు ఆదివారం పెనుగొండలో కలిశారు. ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి ఆధ్వర్యంలో వారు ఆమెను దుశ్శాలువాతో సత్కరించారు. వసతి గృహాల్లో వసతులు మెరుగుకు సత్వరం చర్యలు తీసుకోవాలని, బీసీ యువతకు ఉపాధి కోసం సబ్సిడీ రుణాలు అందించాలని కోరామన్నారు. మంత్రి సానుకూలంగా స్పందించారన్నారు. మంత్రిని కలిసిన వారిలో సీనియర్ నేతలు రామ్మూర్తి, కృష్ణానాయక్, హరి, గిరిదాసు, పృథ్వీ, తిరుపతి, బీ.కృష్ణానాయక్‌లున్నారు.

విజలాపురంలో ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ



రామకుప్పం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): విజలాపురంలో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి పూజిత ఆధ్వర్యంలో ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. వ్యాధి లక్షణాలు, కారకాలు, వ్యాధినిరోధక చర్యలు, చికిత్స గూర్చి వైద్యాధికారి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ బాలు, ఎంఎల్‌హెచ్‌పీ శ్రావణి, స్టాఫ్‌నర్స్ సుజాత, పలువురు ఏఎన్ఎంలు, అశావర్కర్లు పాల్గొన్నారు.

పీఎస్ఎంకు జనసేన నేతల సత్కారం



రామకుప్పం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఏపీఎస్ఆర్టీసీ వైస్‌చైర్మెన్ పీఎస్ మునిరత్నంను ఆదివారం మండల జనసేన నేతలు ఆయన స్వగృహంలో సత్కరించారు. మారుమూల గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని వారు ఆయనను కోరారు. మండలకేంద్రం నుంచి తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల రాజధానులు, పట్టణాలకు బస్సు సర్వీసులు నడపాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు హరీష్, భాస్కర్, షహీన్‌షా, నేతలు భాస్కర్, మహేష్, భాను, చిట్టిబాబు. శీను పాల్గొన్నారు.

ప్రజాహితమే మానవత సేవా సంస్థ ధ్యేయం


సమావేశంలో మాట్లాడుతున్న నందీశ్వరయ్య

పుంగనూరు, డిసెంబరు1 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు నిస్వార్థంగా సేవ చేయడమే మానవత స్వచ్ఛందసేవా సంస్థ ధ్యేయమని ఆ సంస్థ పుంగనూరు చైర్మన్ నందీశ్వరయ్య చెప్పారు. ఆదివారం స్థానిక విశ్రాంత ఉద్యోగ భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంస్థ ఆధ్వర్యంలో శాంతిరథం, ఫ్రీజర్ బాక్స్‌లు అందుబాటులో ఉంచామన్నారు. వాటిని భద్రపరచడానికి షెడ్లు నిర్మించామన్నారు. సంస్థ వ్యవస్థాపకుడు ఎస్.రామచంద్రారెడ్డి ఈనెల 5న పుంగనూరు వస్తారని చెప్పారు. సమావేశంలో నానబాల గణేశ్, డాక్టర్ ప్రభాకర్, నారాయణరెడ్డి, గిరి పాల్గొన్నారు.


కాటిపేరిలో నేలకొరిగిన వరి

పుంగనూరు రూరల్ డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి):: తుపాను ప్రభావం మూడు రోజులుగా ఇక్కడి రైతులను ఇబ్బంది పెడుతోంది. ముఖ్యంగా వరిపంటకు ఎక్కువ నష్టం కలిగిందని అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.మండలంలో దాదాపు 30 ఎకరాలు వరిపంట నీట మునిగింది. వరితో బాటు టమోటా, చామంతి పూల తోటలకు నష్టం వాటిల్లింది. తహసీల్దార్ జే.రాము పరిస్థితులపై ఆరా తీస్తున్నారు.

తుపానుతో అన్నదాత అగచాట్లు


బండలపై కోతలు చేసిన వరి (ఒబ్బిడికి సిద్ధంగా వరి)

●సోమల: ఫెంగల్ తుఫాన్ కారణంగా శుక్రవారం నుంచి వర్షం పడుతోంది. ఆదివారం 83.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. రైతులు వరి నూర్పిడికి ఇబ్బందులు పడుతున్నారు. టమోటాకు చీడపీడలు వ్యాపిస్తాయని ఆందోళన చెందుతున్నారు. టమోటాకు 15కిలో బాక్సు రూ.600కు మించి ధర పలుకుతున్న నేపథ్యంలో వర్షాలకు నాణ్యత దెబ్బతింటుందని వాపోతున్నారు. కోతలు చేయలేకపోతున్నారు. ధాన్యపు రాశులను వర్షానికి తడవకుండా పరదాలు, టార్పాలిన్లు కప్పి రక్షించుకునే ప్రయత్నం చేస్తున్నారు. కొందరు ఆరబెట్టుకునేందుకు ఇబ్బంది పడుతున్నారు. పలు గ్రామాల్లో వరి పైరు నేలకొరిగింది. అక్కడక్కడా కోతలు కోసిన రైతులు హడావుడిగా, కుప్పలు వేసుకోగా గ్రాసం నీటిలోనే ఉండిపోతుంది.

●పలమనేరు : తుపాను కారణంగా రైతులకు నష్టం వాటిల్లింది. వరి కోతకోసి పంటను పొలాల్లోనే కొందరు వదిలి పెట్టగా మరికొందరు కోసి కళ్లాల్లోనే ఉంచారు. మండలంలో 70 శాతంపైగా రైతులు వరికోతలు ముగించారు. మిగిలినవారు కోతదశలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇలాగే ముసురు కొనసాగితే నేల వాలిన పంటకు మొలకలు వస్తాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ●రామకుప్పం: కొనసాగుతున్న ముసురు వల్ల నేలలో తేమశాతం పెరిగి పంటలకు తెగుళ్ళు ఏర్పడి, దిగుబడి, నాణ్యతపై తీవ్ర ప్రభావం చూపుతుందని రైతులు ఆందోళన చెందున్నారు. టమోటా, బంగాళదుంప, బీన్స్, స్వీట్‌కార్న్, బేబీకార్న్‌కు అధిక ధరలు లభిస్తున్న తరుణంలో ముసురు తమ కొంప ముంచుతోందంటున్నారు.


బగళనత్తంలో నేలవాలిన స్వీట్‌కార్న్ తోట


పలమనేరు మండలంలో నేలకొరిగిన వరి

కుప్పంలో నేటి గ్రీవెన్స్ డే రద్దు

కుప్పం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): తుపాను కారణంగా సోమవారం నిర్వహించాల్సిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను రద్దు చేస్తున్నట్లు కడా పీడీ వికాస్ మర్మత్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు సహకరించాలని కోరారు.

అదుపు తప్పి కారు బోల్తా



పలమనేరు, డిసెంబరు1 (ఆంధ్రజ్యోతి) : పలమనేరు-గుడియాత్తం రహదారిలో ఆదివారం ఫ్లైఓవర్ సమీపంలో అదుపు తప్పి బోల్తాపడింది. పలమనేరు నుంచి గుడియాత్తం వెళ్తున్న కారు వర్షం కురుస్తుండటంతో అదుపు తప్పి బోల్తాపడింది. అదృష్టవశాత్తు కారులో ప్రయాణిస్తున్న ముగ్గురు వ్యక్తులు స్వల్పగాయాలతో బయటపడ్డారు.

25 మందికి నేత్రపరీక్షలు

పలమనేరు, డిసెంబరు1 (ఆంధ్రజ్యోతి) : స్థానిక రిక్రియేషన్‌క్లబ్ ఆవరణలో ఆదివారం ఉచిత నేత్ర చికిత్సా శిబిరం నిర్వహించారు. చెన్నై శంకర నేత్రాలయ వైద్యుడు మురళి 25 మందికి పరీక్షలు నిర్వహించారు. 15 మందికి ఆపరేషన్లు అవసరమున్నట్లు గుర్తించారు. వారికి చెన్నై శంకరనేత్రాలయలో ఉచితంగా ఆపరేషన్లు నిర్వహిస్తున్నారు. ఉచిత రవాణా సౌకర్యం కూడా కల్పిస్తున్నట్లు డాక్టర్ మురళి తెలిపారు.

వర్షంలో విధులు నిర్వహించిన మున్సిపల్ కార్మికులు



పలమనేరు, డిసెంబరు1 (ఆంధ్రజ్యోతి) : వర్షాలు కురుస్తున్నా ఆదివారం పలమనేరు మున్సిపల్ కార్మికులు విధులు నిర్వర్తించారు. ప్రజల మన్ననలు పొందారు. రాజకాలువతో పాటు పలు మురుగునీటి కాలువల్లో వర్షపు నీరు ప్రవహించేందుకు వీలుగా పూడికను, చెత్తాచెదారాన్ని తొలగించారు.

వరి కోతలు వాయిదా వేసుకోవాలి

సోమల, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): వాతావరణ పరిస్థితుల దృష్ట్యా వరి కోతలు వాయిదా వేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి సుధాకర్ సూచించారు. ఆదివారం క్షేత్రస్థాయిలో ఆయన పంటలను పరిశీలించారు. కోతలు పూర్తి చేసిన రైతులు ధాన్యం తడిసి పోకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. వరి పొలాల్లో నీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. టమోటా రైతులు వర్షాలు ఆగిన తరువాత మందులు పిచికారీ చేయాలన్నారు. ఆయన వెంట రైతు సేవా ఉద్యోగులు కుమార్, సుబ్రమణ్యం, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రవహిస్తున్న గార్గేయ నది

సదుం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): తిమ్మానాయనపల్లె పంచాయతీ కొర్లగుంటవారిపల్లె ప్రాజెక్టు జోరుగా మొరవపోతుండడంతో గార్గేయ నదిలో నీటి ప్రవాహం పెరిగింది. నదీ పరిసర ప్రాంతాల్లోని కుంటల్లో నీరు చేరుతోంది. సదుం, సోమల మండలాల సరిహద్దుల్లోని వ్యాసప్ప చెరువు కూడా మొరవపోతుండడంతో తిమ్మానాయనపల్లె పంచాయతీ పరిధిలోని చెరువుల్లోకి నీరు జోరుగా చేరుతోంది.

పాత్రికేయుల పాత్ర కీలకం

గంగవరం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలను గుర్తించి ప్రజాగళం ను అధికారులు, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడంలో పాత్రికేయుల పాత్ర కీలకమని ప్రముఖ పారిశ్రామిక వేత్త డీకే చైతన్య పేర్కొన్నారు. ఆదివారం గంగవరంలో ఆంధ్రప్రదేశ్ మీడియా ఫెడరేషన్ జిల్లా సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.

చొరవ తీసుకుంటే ఈ సమస్యలకు పరిష్కారం




ప్రారంభానికి నోచుకోని రైతు బజార్ - బైరెడ్డిపల్లె నెహ్రూనగర్‌లో జనావాసాల మధ్య గుబురుపొదలు -గుంతలమయమైన కడపనత్తం రహదారి

పలమనేరు, డిసెంబరు1 (ఆంధ్రజ్యోతి): పలమనేరు మున్సిపాలిటీలోని వారపు సంత జరిగే స్థలంలో లక్షలాది రూపాయలు ప్రజాధనంతో నిర్మించిన రైతుబజార్ ప్రారంభం ఎప్పుడని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. రైతులు పండించిన కూరగాయలను స్వయంగా వారే విక్రయించుకునేందుకు రైతుబజార్ నిర్మించారు. మూడేళ్లుగా నత్తనడకన సాగిన నిర్మాణ పనులు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఇక్కడి అధికారులు ఆగమేఘాలమీద పూర్తిచేయించారు. రంగులు వేసి దాదాపు మూడు నెలలు గడుస్తున్నా ప్రారంభానికి నోచుకోలేదు. దీనిని ప్రారంభిస్తే రైతుల నుంచే కొనుగోలు చేసుకోవచ్చని ప్రభావిస్తున్నారు.

బైరెడ్డిపల్లెలో లోపించిన పారిశుధ్యం

బైరెడ్డిపల్లె, డిసెంబరు1 (ఆంధ్రజ్యోతి): బైరెడ్డిపల్లెలోని కొన్ని వీధుల్లో పారిశుధ్యం లోపించింది. నెహ్రూనగర్‌లో ఇళ్ల చుట్టుపక్కల ఖాళీ ప్రదేశాల్లో పిచ్చిమొక్కలు మొలిచాయి. విషసర్పాలకు, దోమలకు ఆవాసంగా మారాయి. పాములు ఇళ్లలోకి వచ్చేస్తుండడంతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు. ఆచార్య వీధి, మహమ్మదీయవీధి తదితర చోట్ల కూడా ఇదే పరిస్థితి నెలకొంది. పంచాయతీ అధికారులు స్పందించి పొదలను తొలగించి పారిశుధ్యం మెరుగుపరచడానికి చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

రహదారిని బాగుచేయండి

బైరెడ్డిపల్లె, డిసెంబరు1 (ఆంధ్రజ్యోతి): బైరెడ్డిపల్లె నుంచి కడపనత్తం గ్రామానికి వెళ్లే రహదారి గుంతలమమైంది, రహదారి పొడవునా తారురోడ్డు దెబ్బతింది. వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. గుంతల్లో దిగబడి వాహనాలు దెబ్బతిని వాటి మరమ్మతుల కోసం తమ జేబులకు చిల్లులు పెట్టుకోవాల్సి వస్తోంది. ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ తీసుకుని కడపనత్తం రహదారిని బాగుచేయాని ప్రయాణికులు, వాహనదారులు కోరుతున్నారు.

నేలవాలిన స్తంభాలు: విద్యుత్తుకు అంతరాయం


కొత్తూరులో కిందపడిన విద్యుత్ స్తంభం

సోమల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): తుపాను ప్రభావంతో ఆవులపల్లె పంచాయతీ కొత్తూరు, పత్రపల్లె వద్ద విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. గాంధీనగర్ వద్ద ఈదురు గాలులతో పలు వృక్షాలు విద్యుత్ స్తంభాలు, విద్యుత్ వైర్లపై పడడంతో సరఫరా ఆగిపోయింది. ఈ క్రమంలో సిబ్బంది లైన్లను సరిచేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. పత్రపల్లె, కొత్తూరు మార్గంలో చెట్లు కూలి రాకపోకలకు అంతరాయమేర్పడింది. సర్పంచ్ కోదండరాజు గ్రామస్తులతో కలసి రాకపోకలు పునరుద్ధరించారు.

●చౌడేపల్లె: వర్షం వల్ల కాటిపేరి, దిగువపల్లె, చారాల, శెట్టిపేట పంచాయతీల్లో 50 ఎకరాల పైనే వరి పంట నేలకొరిగింది. చారాలలో 1 విద్యుత్ ట్రాన్స్ పార్మర్, 2 విద్యుత్ స్థంభాలు, కోటూరులో 1 విద్యుత్ ట్రాన్స్ పార్మర్, 3 విద్యుత్ స్థంభాలు దెబ్బతిన్నాయి. ట్రాన్స్‌కో ఏఈ శశికుధర్ సిబ్బందితో వెళ్లి విద్యుత్ పురుద్ధరణకు చర్యలు తీసుకుంటున్నారు. శనివారం సాయంత్రం నుంచి ఆదివారం సాయంత్రం వరకు 65మి.మీ వర్షపాతం నమోదైనట్లు తహసీల్దార్ హనుమంతు పేర్కొన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.. వర్షం కొనసాగితే పంట నష్టం పెరగవచ్చని ఏవో జ్యోతి పేర్కొన్నారు.

ప్రత్యేక కార్పొరేషన్ కోసం పత్ర కుల నేతల వినతి


ఎమ్మెల్సీ కంచర్ల, పీఎస్ఎంకు వినతిపత్రం అందిస్తున్న పత్ర సంక్షేమ సంఘం నాయకులు

కుప్పం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): తమ కులస్తులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని పత్ర సంక్షేమ సంఘం నాయకులు కోరారు. స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆదివారం వారు ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నంలను కలిసి వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్సీ కంచర్ల, పీఎస్ఎంలు స్పందిస్తూ ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి తగు న్యాయం చేసేందుకు కృషి చేస్తామరు. కార్యక్రమంలో పత్ర సంక్షేమ ససంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తలుపుల శ్రీనివాస్ నాయుడు, కుప్పం సంఘం నాయకులు చిట్టిబాబు నాయుడు, సంజీవరాజులు నాయుడు, గోవిందురాజులు నాయుడు, రాజేంద్రనాయుడు తదితరులు పాల్గొన్నారు.

రైతుకు భారంగా మారిన ధాన్యం ఒబ్బిడి

సోమల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రైతులు పంటలను ఒబ్బిడి చేసేందుకు అష్టకష్టాలు పడుతున్నారు. కురుస్తున్న వర్షాలతో సగం పంటలను కోల్పోయిన రైతులకు ఉన్న పంట ఒబ్బిడి, కోత పనులు భారంగా మారాయి. నీట మునిగిన వరి దక్కించుకోవడానికి రైతులంగా ఒత్తిడి పడుతుండటంతో కూలీలకు డిమాండ్ పెరిగిపోయింది. దీంతో కూలి ధరలు పెంచేస్తురు. గత ఏడాది మహిళా కూలీకి రూ.350, పురుషలకు రూ.500 ఇచ్చేవారు. ఇప్పుడు మహిళలకు రూ.500, పురుషులకు రూ.700 ఇవ్వాల్సి వస్తోందని రైతులు ఆవేదన చెందుతున్నారు. కొందరు మధ్యాహ్నం భోజనం, మద్యం సరఫరా చేస్తేనే పనులకు వస్తామంటున్నారంటున్నారు. నూర్పిడి యంత్రాలకు గత ఏడాది గంట కోతకు రూ.2400 ఉండగా ప్రస్తుతం రూ.3500 వరకు అడుగుతున్నారు. రైతులు ధాన్యాన్ని ఇళ్లకు చేర్చుకోవడానికి అవస్థలు పడుతున్నారు.

గంగమ్మ ఆలయంలో అమావాస్య పూజలు

రామకుప్పం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని దిగువవీధి గంగమ్మ ఆలయంలో ఆదివారం అమావాస్య పూజలు వైభవంగా నిర్వహించారు. ఉదయం గంగమ్మతో పాటు రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి వారికి ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు. విశేష అలంకరణలు చేశారు. భక్తులకు అన్నప్రసాదాలను పంపిణీ చేశారు.

శివాలయంలో ప్రత్యేక పూజలు

రొంపిచెర్ల,డివంబరు1: (ఆంధ్రజ్యోతి) బొమ్మయ్యగారిపల్లె పంచాయతీలోని కట్టకింద శివాలయంలో కార్తీకమాసం ముగింపు సందర్భంగా ఆదివారం ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహాఅమావాస్య సందర్భంగా రుద్రాభిషేకం, పంచామృత అభిషేకాలు చేశారు. అర్చనలుచేసి, కార్తీక దీపాలు వెలిగించారు. భక్తులకు ఉభయదాతలు ప్రసాదాలు ఇచ్చారు.

కుప్పంలో కొనసాగుతున్న వర్షం

కుప్పం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కుప్పంలో తుపాను ప్రభావంతో వర్షం ఆదివారంనాడు కూడా కొనసాగింది. ఉదయంనుంచి రాత్రిదాకా ఓ మోస్తరు వాన పడుతూనే ఉంది చలిగాలుల తీవ్రత అధికమైంది. ఉష్ణోగ్రత 22 సెల్సియస్ డిగ్రీలకు పడిపోయింది.

● రొంపిచెర్ల: శనివారం నుంచి ఆదివారం ఉదయం వరకు 66.07 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు గణాంకాధికారి రాజేశ్వరి తెలిపారు. ఉద్యోగులు అలర్టుగా ఉండాలని ఎమ్మార్వో కిరణ్‌కుమార్ ఆదేశించారు.

నీటి విడుదల


ఎన్టీఆర్ జలాశయం నుంచి నీరు విడుదల

పెనుమూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పెనుమూరు మండలం కలవగుంటలో ఉన్న ఎన్టీఆర్ జలాశయం నుంచి ఒక గేటు ద్వారా నీటిని దిగువకు విడుదల చేశారు. ఎగువ ప్రాంతాల నుంచి జలాశయానికి నీరు చేరుతున్న నేపథ్యంలో గేటు ద్వారా 50 క్యూసెక్కుల నీటిని దిగువకు పంపుతున్నామని ఇరిగేషన్ ఏఈ భరత్ తెలిపారు.

ఎయిడ్స్ నివారణకు కృషి చేయాలంటూ ర్యాలీ



పుంగనూరులో విద్యార్థులతో కలసి ర్యాలీ చేస్తున్న ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు

పుంగనూరు రూరల్, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్ డే సందర్భంగా ఆదివారం స్థానిక ఆసుపత్రి నుంచి వైద్యులు, విద్యార్థులు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏరియా ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ మధుసూధనాచారి మాట్లాడుతూ ప్రజలు వ్యాధుల పట్ల అవగాహన పెంచుకోవాలన్నారు. లైంగిక వ్యాధులను నివారించేందుకు డాక్టర్ల సూచనలు, సలహాలు తప్పక పాటించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు, సిబ్బంది, కాలేజీ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. ●గంగవరం: పీహెచ్‌సి వైద్యులు, సిబ్బంది గంగవరంలో ఆదివారం అవగాహనా ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రస్తుతం పాజిటివ్ వచ్చిన ప్రతి ఒక్కరికీ ఏఆర్‌టి మందులు ఉచితంగా అందిస్తున్నారన్నారు. ర్యాలీలో డాక్టర్ లహరి, సూపర్‌వైజర్ జ్యోతీశ్వర్ లతోపాటు పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

గుండెపోటుతో జూనియర్ అసిస్టెంట్ మృతి


శ్రీబాబు (ఫైల్ ఫొటో)

గంగాధరనెల్లూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): యాదమరి మండలం పి.గొల్లపల్లె హైస్కూల్లో పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్ (క్లర్క్) శ్రీబాబు (50) గుండెపోటుతో మృతి చెందారు. గంగాధరనెల్లూరు దళితవాడకు చెందిన ఈయన గంగాధరనెల్లూరు హైస్కూల్లో రికార్డు అసిస్టెంట్‌గా పనిచేస్తూ.. ఇటీవల పదోన్నతిపై పి.గొల్లపల్లెకు జూనియర్ అసిస్టెంట్‌గా వెళ్లారు. ఆదివారం మధ్యాహ్నం ఇంటివద్ద ఉండగా గుండెపోటు వచ్చింది. కుటుంబీకులు తొలుత చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. తర్వాత మెరుగైన వైద్యం నిమిత్తం తిరుపతి స్విమ్స్‌కి తీసుకెళ్లారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు.

పది గ్రామాలకు రాకపోకలు కట్


వాగు వద్ద అధికారులు

శ్రీరంగరాజపురం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎస్ఆర్ పురం మండలంలో పాతపాళ్యం వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. రోడ్డుపై పారడంతో సుమారు 10 గ్రామాలకు రాకపోకలకు అంతరాయం కల్గింది. ఈ రోడ్డుపై రాకపోకల్లేకుండా అధికారులు బారికేడ్లను పెట్టారు. చుట్టుపక్కల గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ లోకనాథంపిళ్ళై, ఎంపీడీవో మోహన మురళి, ఎస్ఐ సుమన్ హెచ్చరించారు. అధికారులు వాగు పరిశీలించారు.

చిత్తూరు
జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి


ఉగ్రాణంపల్లె వద్ద


మఠంపల్లె వద్ద

ఇవి రోడ్లే..!

పెనుమూరు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): తుఫాన్ కారణంగా కొన్నిచోట్ల రహదారులు చెరువులను తలపిస్తున్నాయి. పెనుమూరు-చిత్తూరు మార్గంలో అక్కడక్కడా రోడ్లపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడటంతో వాటిలో వర్షపు నీరు చేరి చెరువులను తలపిస్తున్నాయి. ఉగ్రాణంపల్లె వద్ద ఇటీవల రోడ్డు పనులు ప్రారంభించి.. సగంలో ఆపేయడంతో మూడు అడుగుల గొయ్యి ఏర్పడి.. నీరు నిలిచిపోయింది. గంగుపల్లె చెరువు వద్ద గుంతల రోడ్డుపై నీరు నిలిచిపోయింది. మఠంపల్లె వద్ద సుమారు వంద అడుగుల పొడవునా రోడ్డుపై వర్షపునీరు ప్రవహిస్తోంది.

కృష్ణాపురం జలాశయం నీటిని వృథా కానివ్వం

● ప్రభుత్వ విప్ డాక్టర్ థామస్

వెదురుకుప్పం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కృష్ణాపురం జలాశయం నీటిని వృథా కానివ్వమని ప్రభుత్వ విప్, గంగాధరనెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ వీఎం థామస్ తెలిపారు. ఆదివారం కార్వేటినగరం మండలంలో వర్షం కురుస్తున్నా చెరువు గట్ల వెంబడి పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గతంలో కృష్ణాపురం రిజర్వాయర్ నుంచి నీటిని దిగువకు విడుదల చేయడంతో వృథాగా తమిళనాడులోని సముద్రంలో కలిసేదన్నారు. ప్రస్తుతం ఆ నీటిని ఎడమ వైపు ఉన్న ఆరు చెరువులకు నింపే ప్రయత్నం చేశామన్నారు. ఇప్పటికే ఏపిల్, అయ్యవారి చెరువు, కృష్ణాపురం దిగువ చెరువు, పొనగల్లు చెరువులు నిండిపోయాయని చెప్పారు. కృష్ణసముద్రం, నాయుడు చెరువులు నిండాల్సి ఉందన్నారు. అలాగే కుడివైపు ఉన్న చెరువులను కూడా నింపుతామన్నారు. ఈ ప్రాంతంలో నిర్మించాలనకున్న నూతన ప్రాజెక్టుకు ప్రజలు, రైతుల నుంచి అభ్యంతరాలు రావడంతో వారి మనోభావాలను దెబ్బతీయకూడదని విరమించుకుంటున్నామన్నారు. అయితే నాలుగు చెక్ డ్యాంలు నిర్మించి.. నీటి నిల్వలు పెంచుతామన్నారు. ఏపిల్, అయ్యవారి చెరువులను సందర్శించి, జలహారతి ఇచ్చారు. కృష్ణాపురం రిజర్వాయర్ మరమ్మతు, అభివృద్ధి పనులకు తనవంతు కృషి చేస్తానని స్పష్టం చేశారు. తుఫాను కారణంగా ఎవరూ ఇబ్బంది పడకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. కార్వేటినగరం మండల టీడీపీ అధ్యక్షుడు చెంగ్రాయ యాదవ్, తెలుగు యువత కార్యనిర్వాహక కార్యదర్శి బీగాల రమేష్, ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు గుండయ్య తదితరులు పాల్గొన్నారు.


జలహారతి ఇస్తున్న థామస్

తక్షణ సహాయక చర్యలు చేపట్టండి: ఎమ్మెల్యే భానుప్రకాష్

నగరి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నగరి మండల పరిధిలోని పలు ప్రాంతాల్లో ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ ఆదివారం పర్యటించారు. తుఫాన్ వల్ల నష్టపోయిన వారికి తక్షణమే సాయం అందించాలని అధికారులకు సూచించారు. లోతట్టు ప్రాంతాల్లోని వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. కాగా, ఎం.కొత్తూరులో బెండ తోటలు జలమయమయ్యాయి. పలు చోట్ల మినప తోటల్లోకి నీరు చేరడంతో పంట దెబ్బతింటుందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలో 12 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు తహసీల్దారు రవికుమార్ తెలిపారు. నగరిలో కూలిన ఫ్లెక్సీలను మున్సిపల్ సిబ్బంది తొలగించారు.


నగరిలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే భానుప్రకాష్


జలమయమైన బెండ తోట

రైతులకు తీవ్రనష్టం



విజయపురం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుపాను ప్రభావంతో మండలంలోని రైతులకు తీవ్రనష్టం వాటిల్లింది. వేరుశనగ, వరి పంటలు నీట మునిగాయి. ఆదివారం ఈదురు గాలుల తీవ్రత తగ్గినా.. వర్షం కురుస్తూనే ఉండటంతో జనజీవనం స్తంభించింది. చిత్తూరు - తచ్చూరు హైవే పనుల్లో భాగంగా కళియంబాకం చెల్లాతమ్మ ఆలయ సమీపంలో గ్రామానికి వెళ్లడానికి హైవే కింద ఏర్పాటు చేసిన రోడ్డులో నీరు నిలిచి వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తాయి. మండలంలో 42 చెరువులుంటే 37 నిండుకుండలా మారాయి. ఎస్ఎస్ కండ్రిగ - ఇళ్ళత్తూరు మార్గంలో వర్షపునీరు నిలిచి ఇబ్బందిగా మారిందని గ్రామస్తులు తెలిపారు. లోతట్టు ప్రాంతవాసులు సురక్షిత ప్రాంతాలకు చేరుకోవాలని తహసీల్దార్ కిరణ్ సూచించారు. అత్యవసరమైతే కంట్రోల్ రూం నెంబరు 96666 89468కు సమాచారం ఇవ్వాలని కోరారు.







ఇళ్లత్తూరులో మొరవ పారుతున్న చెరువు, ఎస్ఎస్ కండ్రిగ - ఇళ్లత్తూరు మార్గంలో, కళియంబాకం వద్ద హైవే కింద రోడ్డుపై నిలిచిన వర్షపునీరు


నీట మునిగిన వేరుశనగ, వరి పంటలు

నేలవాలిన వరి

పాలసముద్రం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలో 13 చెరువులుంటే ఆరింటికి కలుజు పారుతున్నాయి. కోదండరామాపురం, ఆముదాల, సింహరాజుపురం, పాలసముద్రం పంచాయతీల్లో సాగు చేసిన వరి పంట గాలికి నేలవాలింది. దీంతో సాగు కోసం ఖర్చు చేసిన వేలాది రూపాయలు నష్ట పోయామని చిన్నబ్బరాజు, నాగరత్నం నాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్ఆర్ఆర్కండ్రిగ, గంగమాంబాపురం పంచాయతీల్లో అరటి తోటలు ధ్వంసమయ్యాయి. నష్ట పోయిన తమను ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

తవణంపల్లె: మండలంలోని పలు గ్రామాల్లో వాన, ఈదురు గాలులకు కోత దశలో ఉన్న వరి పంట నేల వాలింది.


జొన్నగురకల సమీపంలో..

దెబ్బతిన్న వేరుశనగ

నింద్ర, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఆదివారం ఉదయం నుంచి రోజంతా ఎడతెరపిలేని జడివానతో జనజీవనం స్తంభించింది. చలిగాలులు ఎక్కువగా ఉండడంతో ఇళ్ల నుంచి జనం బయటకు రాలేదు. వేరుశనగ పంట దెబ్బతింది. చెరువులకు నీరు చేరి.. కలుజులు పారుతున్నాయి. తహసీల్దార్ శేషగిరిరావు పరిస్థితిని సమీక్షిస్తూ.. అధికారులను అప్రమత్తం చేశారు.





దెబ్బతిన్న వేరుశనగ పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి తులసి - కలుజు పారుతున్న అరూరు చెరువు

పది గ్రామాలకు రాకపోకలు కట్


వాగు వద్ద అధికారులు

శ్రీరంగరాజపురం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎస్ఆర్పురం మండలంలో పాతపాళ్యం వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. రోడ్డుపై పారడంతో సుమారు 10 గ్రామాలకు రాకపోకలకు అంతరాయం కల్గింది. ఈ రోడ్డుపై రాకపోకల్లేకుండా అధికారులు బారికేడ్లను పెట్టారు. చుట్టుపక్కల గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ లోకనాంపిళ్ళై, ఎంపీడీవో మోహన మురళి, ఎస్ఐ సుమన్ హెచ్చరించారు.

నగరంలో ఎడతెరిపిలేని వర్షం

చిత్తూరు అర్బన్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): నగరంలో ఆదివారం కూడా వర్షం కురిసింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎడతెరిపి లేకుండా కురవడంతో జనం ఇళ్ల నుంచి బయటకు రాలేదు. సెలవు కూడా కావడంతో ప్రధాన వీధుల్లో చాలావరకు జనసందడి తగ్గింది. చాలావరకు లోతట్టు ప్రాంతాల్లోని వీధులు జలమయం అయ్యాయి. చిరు వ్యాపారులైతే వ్యాపారాల్లేక ఇబ్బంది పడ్డారు.






గురుగునత్తానికి రాకపోకలు బంద్


అండర్ బ్రిడ్జి కింద నిలిచిన నీరు

గుడిపాల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నంగమంగళం పంచాయతీ గురుగునత్తం వెళ్లే రహదారిలోని అండర్ బ్రిడ్జి కింద వర్షపు నీరు నిలిచింది. దీంతో గ్రామానికి రాకపోకలు స్తంభించాయి. నీరు వెళ్లేలా చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. కాగా, వీఆర్వోలు, వీఆర్ఏలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి, ఎంపీడీవో శివరాజ్ ఆదేశించారు. ఈ మేరకు వారితో సమీక్షించి, సూచనలిచ్చారు.



ఎన్టీఆర్ జలాశయం నుంచి నీటి విడుదల

పెనుమూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పెనుమూరు మండలం కలవగుంటలో ఉన్న ఎన్టీఆర్ జలాశయం నుంచి ఒక గేటు ద్వారా నీటిని దిగువకు విడుదల చేశారు. ఎగువ ప్రాంతాల నుంచి జలాశయానికి నీరు చేరుతున్న నేపథ్యంలో గేటు ద్వారా 50 క్యూసెక్కుల నీటిని దిగువకు పంపుతున్నామని ఇరిగేషన్ ఏఈ భరత్ తెలిపారు.

కూలిన భారీ వృక్షం

వెదురుకుప్పం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): తుఫాను కారణంగా కార్వేటినగరం ఎంపీడీవో కార్యాలయం సమీపంలో ఉన్న భారీ వృక్షం నేలకూలింది. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. జడివానతో వెదురుకుప్పం, కార్వేటినగరం మండలాల్లో జనజీవనం స్తంభించింది. రోజువారీ కూలీలు కూడా పనుల్లేక ఇళ్లకే పరిమితమయ్యారు.


కార్వేటినగరం ఎంపీడీవో ఆఫీసు సమీపంలో కూలిన వృక్షం

నిండిన 30 చెరువులు

వెదురుకుప్పం మండల పరిధిలో 178 చెరువులకుగాను 30 పూర్తిస్థాయిలో నిండి కలుజు పారుతున్నట్లు నీటిపారుదల శాఖ ఏఈ మంజుల ఆదివారం తెలిపారు. దేవళంపేట వైపు ఉన్న చెరువుల్లో నీరు రాలేదని.. జక్కిదొన నుంచి మాంబేడు వరకు ఉన్న చెరువుల్లో నీరి చేరిందన్నారు. ఎక్కడా చెరువులకు ప్రమాదకర పరిస్థితి లేదన్నారు.

అంధకారంలో గ్రామాలు

వర్షం కారణంగా వెదురుకుప్పం మండలంలో పలు గ్రామాలు విద్యుత్ సరఫరా లేకుండా అంధకారంలో ఉన్నాయి. విద్యుత్ శాఖ సిబ్బంది పునరుద్ధరణ చర్యలు చేపట్టినా చాలాగ్రామాలు అంధకారంలోనే ఉన్నాయి.

అంత్యక్రియలకూ ఇబ్బందేనా..?



నగరి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నగరి మున్సిపాలిటీ పరిధిలోని నగరిపేటలో ఆదివారం ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ప్రాంతం నుంచి శ్మశానానికి వెళ్లడానికి సరైన దారి వసతి లేదు. దీనివల్ల ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ఆ దారిపై నీరు నిలబడింది. కొన్నిచోట్ల మోకాటి లోతు వరకు నిలిచింది. దీంతో ఆ నీటిలో దిగి.. ఇబ్బంది పడుతూనే మృతదేహాన్ని శ్మశానానికి తీసుకెళ్లి అంత్యక్రియలు పూర్తి చేయాల్సి వచ్చిందని స్థానికులు వాపోయారు. ఇకనైనా అధికారులు స్పందించి సరైన రోడ్డు వసతి కల్పించాలని కోరుతున్నారు.

గుండెపోటుతో జూనియర్ అసిస్టెంట్ మృతి


శ్రీబాబు (ఫైల్ ఫొటో)

గంగాధరనెల్లూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): యాదమరి మండలం పి.గొల్లపల్లె హైస్కూల్లో పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్ (క్లర్క్) శ్రీబాబు (50) గుండెపోటుతో మృతి చెందారు. గంగాధరనెల్లూరు దళితవాడకు చెందిన ఈయన గంగాధరనెల్లూరు హైస్కూల్లో రికార్డు అసిస్టెంట్గా పనిచేస్తూ.. ఇటీవల పదోన్నతిపై పి.గొల్లపల్లెకు జూనియర్ అసిస్టెంట్గా వెళ్లారు. ఆదివారం మధ్యాహ్నం ఇంటివద్ద ఉండగా గుండెపోటు వచ్చింది. కుటుంబీకులు తొలుత చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. తర్వాత మెరుగైన వైద్యం నిమిత్తం తిరుపతి స్విమ్స్కి తీసుకెళ్లారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు.

వక్ఫ్ బోర్డు ఆస్తుల పరిరక్షణకు చర్యలు: టీడీపీ

చిత్తూరు సెంట్రల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): వక్ఫ్ బోర్డు ఆస్తుల పరిరక్షణకు ప్రభుత్వం చర్యలు చేపట్టినట్లు టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వెంకిటీల సురేంద్రకుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని నిబంధనలతో ప్రభుత్వం త్వరలో కొత్త వక్ఫ్ బోర్డు ఏర్పాటు చేస్తుందన్నారు. ముస్లింల ప్రయోజనాలకు, వారి సంక్షేమానికి సీఎం చంద్రబాబు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారని పేర్కొన్నారు.

నందీశ్వరుడికి ప్రత్యేక పూజలు

వెదురుకుప్పం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): చవటగుంటలోని మీనాక్షి సమేత ఆవుదేవర నందీశ్వరస్వామి ఆలయంలో ఆదివారం విశేష పూజలు జరిగాయి. చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు అక్కడికి చేరుకుని స్వామిని దర్శించుకున్నారు. మొక్కులు చెల్లించుకున్నారు. ఏర్పాట్లను ఆలయ ధర్మకర్త పేట రాధాకృష్ణారెడ్డి పర్యవేక్షించారు.


గోపూజా కార్యక్రమంలో భక్తులు

ఎయిడ్స్ నియంత్రణకు కృషి చేద్దాం / డీఎంహెచ్వో, చుడా చైర్పర్సన్ పిలుపు

చిత్తూరు రూరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్ వ్యాధి నియంత్రణకు కృషి చేద్దామని డీఎంహెచ్వో ప్రభావతీదేవి, చుడా చైర్పర్సన్ కఠారి హేమలత పిలుపునిచ్చారు. ఆదివారం ప్రపంచ ఎయిడ్స్ డే సందర్భంగా ప్రభుత్వాస్పత్రి నుంచి గాంధీ విగ్రహం వరకు అపోలో నర్సింగ్ విద్యార్థులు, అధికారులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. 2030 నాటికి ఎయిడ్స్ రహిత సమాజంగా మార్చేందుకు కృషి చేద్దామన్నారు. జిల్లా హెచ్ఐవీ, ఎయిడ్స్ నిర్మూలన అధికారి వెంకటప్రసాద్ మాట్లాడుతూ.. జిల్లాలో 6,381 మంది ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులు ఉన్నారని తెలిపారు. గతంలో పోలిస్తే జిల్లాలో ఎయిడ్స్ వ్యాప్తి చాలావరకు తగ్గిందన్నారు. వైద్యులు శిరీష, ఎంహెచ్వో లోకేష్, బీజేపీ నాయకుడు చిట్టిబాబు పాల్గొన్నారు.

యాదమరి: పీహెచ్సీ, ఆరోగ్య సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించారు. సీహెచ్వో లక్ష్మీనారాయణ, డీపీఎంవో మణి, హెల్త్ సూపర్వైజర్లు లక్ష్మీపతి, సెల్వరాణి, ఎంఎల్హెచ్పీలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

బంగారుపాళ్యం: గిరిజన బాలుర గురుకుల పాఠశాల వసతిగృహంలో విద్యార్థులకు ఎయిడ్స్పై అవగాహన కల్పించారు. డీపీఎం మణి, హెచ్ఐవీ కౌన్సిలర్ బాబు పాల్గొన్నారు.

పాలసముద్రం: పీహెచ్సీ సిబ్బంది డాక్టర్ బి.ప్రవీణ్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. సీహెచ్వో జ్ఞానశేఖర్, సూపర్వైజర్ మురళి, ఏఎన్ఎంలు లక్ష్మి, అరుణ, రేవతి, కమల, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.


ర్యాలీలో పాల్గొన్న కఠారి హేమలత, ప్రభావతీదేవి తదితరులు

'వన్నియకుల' డైరెక్టర్కు సన్మానం

నగరి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వన్నియకుల క్షత్రియ డైరెక్టర్గా నియమితులైన నగరి మండలంలోని కృష్ణాపురానికి చెందిన శ్రీనివాసులురెడ్డిని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ సన్మానించారు. తనకు పదవి రావడంతో కృతజ్ఞతలు తెలపడానికి ఎమ్మెల్యే వద్దకు ఆదివారం వెళ్లారు. ఈనేపథ్యంలో ఆయన్ను ఎమ్మెల్యేనే సత్కరించారు. టీఎన్టీయూసీ రాష్ట్ర కార్యదర్శి బాలాజి, మండల కార్యదర్శి పురుషోత్తమనాయుడు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ సురేష్నాయుడు, మాజీ జడ్పీటీసీ వెంకటరత్నం, పరందామనాయుడు, జవహర్రెడ్డి, దేవరాజ పాల్గొన్నారు.


శ్రీనివాసులురెడ్డిని సన్మానించిన భానుప్రకాష్

బాధితురాలికి ఎమ్మెల్యే పరామర్శ: నగరిలోని ఓంశక్తి దేవాలయం వద్ద ఫ్లెక్సీ బోర్డు విరిగిపడ్డ ప్రమాదంలో తలకు గాయమైన అభి అనే మహిళను ఎమ్మెల్యే ఆదివారం పరామర్శించారు.

చెత్త సేకరణ కేంద్రాల గతి ఇంతేనా?

నగరి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): చెత్త నుంచి సంపదను సృష్టించడానికి టీడీపీ హయాంలో ఏర్పాటు చేసిన కేంద్రాలను వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిర్లక్ష్యం చేసింది. చెత్త సేకరణకు వాడే బ్యాటరీ వాహనాలు, మూడుచక్రాల సైకిళ్లు మూలన పడ్డాయి. కార్మికులకు జీతాలు ఇవ్వక పోవడంతో చెత్త సేకరణను ఆపేశారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చాక సీఎం చంద్రబాబు ఈ చెత్తసేకరణ కేంద్రాలను పునఃప్రారంభించారు. కానీ నగరి నియోజకవర్గంలోని నగరి, నింద్ర, విజయపురం మండలాల్లో చెత్తసేకరణ చేట్టకపోవడం విచారకరం. ప్రతి మండలంలోనూ ఒకటి, రెండు పంచాయతీలు మినహా మిగిలినచోట్ల చెత్తసేకరణ చేపట్టక పోవడంతో దోమల బెడద అధికమై జనం రోగాల బారిన పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి.. చెత్తసేకరణకు వాహనాలను సిద్ధం చేసి, గ్రామాల్లో పారిశుధ్యాన్ని మెరుగుపరచాలని స్థానికులు కోరుతున్నారు.





గుండ్రాజకుప్పం దళితవాడలో డంపింగ్యార్డులా మారిన చెత్త సేకరణ కేంద్రం, మూలనపడ్డ వాహనాలు

ఈ రోడ్డును పట్టించుకోరా?



వెదురుకుప్పం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం మండలం మాంబేడు క్రాస్ నుంచి మాంబేడు మీదుగా కసవనూరు క్రాస్ వరకు లింకు రోడ్డు ఉంది. ఈ మార్గంలో పలు గ్రామాలు ఉన్నాయి. ఈ రోడ్డు గుంతలు పడి అధ్వానంగా తయారైంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో మరమ్మతులు చేయక పోవడంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. కూటమి ప్రభుత్వంలోనైనా ఈ రోడ్డును బాగుచేయాలని జనం కోరుతున్నారు.

కమనీయంగా లక్ష్మీనారాయణుల కల్యాణం


భక్తులకు మంగళసూత్రాన్ని చూపుతున్న అర్చకులు

గంగాధరనెల్లూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): వేపంజేరిలో వెలసి ఉన్న లక్ష్మీనారాయణుల కల్యాణోత్సవాన్ని ఆదివారం కమనీయంగా నిర్వహించారు. అలాగే కోనేటి వద్ద ధన్వంతరి స్వామికి అభిషేకం చేవారు. కల్యాణోత్సవానికి హైదరాబాద్కు చెందిన జ్యోతి, విజయకుమార్, అభిషేకానికి తిరుపతికి చెందిన మురళి, శ్రీనివాసన్ ఉభయదారులుగా వ్యవహరించారు. టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టుకు చెందిన భాగవతార్ రమేష్ హరికథాకాలక్షేపం చేయగా, వేంకటేశ్వర భక్తిగీతాలు, అన్నమయ్య కీర్తనలను కుమార్ ఆలపించారు. మాజీ ఆలయట్రస్టీ సతీమణి సుమిత్రా శ్రీధర్, ఆలయ మేనేజర్ నల్లా వెంకటేశులురెడ్డి, అర్చకులు ముత్తుక్రిష్ణన్, విష్ణుస్వామి, గోవిందస్వామి, ద్వివేది, గౌరీష్, భక్తులు పాల్గొన్నారు.

జోరుగా టీడీపీ సభ్యత్వ నమోదు

నింద్ర, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీరామపురం పంచాయితీ సదాశివపురంలో ఆదివారం టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం జోరుగా జరిగింది. నాయకులు అభిషేక్, మనోజ్ యాదవ్, కాటయ్య, మనోమర్నాయుడు, అప్పారావు, ఢిల్లీనాయుడు తదితరులు పాల్గొన్నారు.

గంగాధరనెల్లూరు: నెల్లేపల్లె పంచాయతీలో 1005 మందికి టీడీపీ సభ్యత్వం నమోదును విజయవంతంగా చేయించామని టీడీపీ యాదవ సాధికార సమితి జిల్లా అధ్యక్షుడు శ్రీధర్యాదవ్ అన్నారు. ఈ సందర్భంగా నెల్లేపల్లెలో ఆదివారం ఆయన్ను టీడీపీ అభిమానులు, కార్యకర్తలు సన్మానించారు. నాయకులు పుష్పరాజ్, సుబ్రమణ్యం, దేవరాజులునాయుడు, వెంకటపతిరెడ్డి, వెంకటేష్యాదవ్, అఖిల్, పురుషోత్తం, సుమతి తదితరులు పాల్గొన్నారు.

అబాకస్ పోటీల్లో బృందావన్ విద్యార్థుల ప్రతిభ



చిత్తూరు సెంట్రల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి అబాకస్ పోటీల్లో బృందావన్ విద్యార్థులు ప్రతిభ చూపారని కరెస్పాండెంట్ శైలజకుమారి, డైరెక్టర్ ప్రియతేజ తెలిపారు. తమిళనాడు రాష్ట్రం వేలూరులోని శ్రీనారాయణి స్కూల్లో ఆదివారం 11వ రాష్ట్రస్థాయి అబాకస్ పోటీలు నిర్వహించారన్నారు. ఈ పోటీల్లో తమ పాఠశాల నుంచి 64 మంది విద్యార్థులు పాల్గొన్నారన్నారు. ఏడో తరగతి చదువుతున్న పి.సుదిక్ష.. చాంపియన్షిప్ సాధించిందన్నారు. ఎనిమిది మంది విద్యార్థులు విన్నర్స్గా, 16మంది విద్యార్థులు రన్నర్స్గా నిలిచారన్నారు.